# కొత్తపేటలో బాలుడికి డెంగ్యూ

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** ఓ బాలుడికి డెంగ్యూ వ్యాధి సోకింది. వ్యాధి లక్షణాలను గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆ బాలుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన సరూర్‌నగర్ సర్కిల్ కొత్తపేట పరిధి టెలిఫోన్‌కాలనీలో చోటుచేసుకుంది. ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీకి చెందిన అభిజ్ఞ(12)అనే బాలుడికి డెంగ్యూ సోకిన సమాచారం తెలిసిన వెంటనే సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. డెంగ్యూ వ్యాధి సోకిన అభిజ్ఞ కుటుంబ సభ్యులతో కమిషనర్ మాట్లాడారు. అదేవిధంగా దోమల వల్ల సోకే ఈ వ్యాధి గురించి కమిషనర్ స్థానికులకు వివరించారు. దోమల వల్ల సోకే వ్యాధులు వాటి జీవిత చక్రం, సీజనల్ వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. వారానికి ఒకసారి డ్రై డే పాటించాలని, నీటి నిల్వలను తొలగించి దోమల వృద్ధిని అరికట్టాలని, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుండి సంరక్షించుకోవాలని, ముఖ్యంగా వర్షాకాలంలో తగు జాగ్రత్తలు పాటించి దోమ గుడ్లు పెట్టే ప్రదేశాలను గుర్తించి నీటినిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. దోమ జీవితకాలం, గుడ్లు పెట్టే విధానం, గుడ్లు పెరిగి వాటి వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. మంచినీటిలో పుట్టే దోమల వల్ల డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వచ్చే అవకాశం ఉందని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రాంబాబు, సూపర్వైజర్ శ్యాంసుందర్, డిఎంఒ సిబ్బంది పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్



# హైదరాబాద్ వార్త




హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు



కోకోపేట్ వద్ద నియో పోలీస్ ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్‌ను ప్రారంభించటానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానికులతో కరచాలనం చేస్తున్న దృశ్యం

# సామాన్యుడి దూకుడు

**పటాన్‌చెరులోని ప్రజా పార్కు స్థలంలో రాత్రికి రాత్రి గుడి నిర్మాణం**

**కబ్జాదారుల చేతిల్లోకి గాజుల రామారం చిన్న బంధం చెరువు**

**పీ అండ్ టీ కాలనీలో అర ఎకరం పార్కు అక్రమార్కుల పరం**

**గంధంగూడలో 3.28 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం**

**మాచ బొల్లారంలో ముతులకుల కుంటపైనా పంజా**

**హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ**

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** పార్కులు, రహదారులు, చెరువులు.. ప్రజా వసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జా విషయంలో ఫిర్యాదు చేయడానికి సామాన్యులు కూడా వెనుకాడడంలేదు. అర్థబలం, రాజకీయ అండదండలున్నవారని మనకెందుకు అనుకో వడంలేదు. పార్కులు కబ్జా అవుతున్నా.. తామెళ్లేందుకు వీలు లేకుండా రహదారులు ఆక్రమణలకు గురౌతున్నా ఊరుకోవడంలేదు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణిలో మొత్తం 36 ఫిర్యాదులు అందాయి. పార్కు స్థలాన్ని ఇష్టానుసారం వినియోగిస్తున్నారని.. చెరువుల్లోకి మురుగు నీరు చేరడంతో తమ నివాసాలు ముంపునకు గురౌతున్నాయని ఫిర్యాదులందాయి. రహదారులు, పార్కులు కబ్జా కాకుండా చూడాలని పలువురు ఫిర్యాదులు అందజేశారు. నాలాలపై అక్రమ కట్టడాలున్నాయని.. ఆఖరకు విద్యుత్ హై టెన్షన్ వైర్ల కింద కూడా నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొన్నారు. తమ ఇంటికి దారి బంద్ చేశామని ఒకరు, రోడ్డును ఆక్రమించేశారని మరొకరు ఫిర్యాదులు చేశారు. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కళ్ల ముందే కబ్జాలకు గురి అవుతున్నాయని వాపోయారు. ఇలా వచ్చిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఫిర్యాదుదారుల సమక్షంలోనే గతంలో ఎలా ఉండేది.. ఇప్పుడు ఎలా ఉందో గూగుల్, శాటిలైట్ మ్యాప్‌ల ద్వారా వివరించి.. సంబంధిత అధికారులకు ఆ సమస్యల పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

**ఫిర్యాదులు ఇలా..**

పటాన్‌చెరులోని ఏపీఆర్ ప్రవీణ్ లగ్జారియాలోని పార్కు స్థలంలో రాత్రికి రాత్రి గుడి కట్టేస్తున్నారంటూ హైడ్రా ప్రజావాణిలో అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. ఇదేమని అడిగితే దాడికి దిగారని వాపోయారు. దాదాపు 39 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లే ఔట్‌లో 500ల వరకూ విల్లాలుండగా.. ఇందులోని పార్కుకు కేటాయించిన స్థలంలో గుడి కడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలోని చిన్న బంధం చెరువును ఇరువైపుల నుంచి కబ్జాలు చేసేస్తున్నారని.. చెరువులోని నీళ్లన్నీ కిందకు వదిలేస్తున్నారని గాజులరామారం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు.

చెరువు వాస్తవ విస్తీర్ణం ఎంతనేది నిర్ణయించి ఫెన్సింగ్ వేయాలని కోరారు. ఇప్పుడే నీళకలన్నీ కిందకు వదిలేస్తే.. వేసవిలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోతాయని వాపోయారు. రాజేంద్రనగర్ మండలం బండ్లగూడ విలేజ్‌లోని పీ అండ్ టీ కాలనీలో అర ఎకరం పార్కు కబ్జాకు గురి అవుతోందని ఆకాలనీ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలోని గండిపేట మండలం గంధం గూడ గ్రామంలోని 3.28 ఎకరాల ప్రభు త్వ భూమి కబ్జాకు గురి అవుతోందని పలువురు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాచ బొల్లారం గ్రామంలోని ముతుకుల కుంట విస్తీర్ణం రోజురోజుకూ పెరిగిపోతోందని.. 4.62 ఎకరాల చెరువు కాస్త 12 ఎకరాలు దాటిపోయిందని అక్కడి నివాసితులు వాపోయారు. తూములు బంద్ చేసి, అలుగును కూడా పెంచేశారంటూ ప్రజావాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమతి పొందిన లే ఔట్‌లు నీట మునుగుతున్నాయని వాపోయారు.

# ఓటర్ల నమోదుకు 17 వరకే ఛాన్స్

**408 పోలింగ్ కేంద్రాలకు నిర్ణయం-తుది బాజితా 30న విడుదల**

**బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని రాజకీయ పార్టీలకు ఇసి పిలుపు**

**పారదర్శక జాబితా తయారీలో భాగస్వామ్యం కావాలని సూచన**




రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్/జూబ్లీహిల్స్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** నిన్నటి దాకా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో బిజీగా ఉన్న జిహెచ్‌ఎంసి అధికారులు తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఏర్పాట్లపై వేగం పెంచారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఎంపికకు శ్రీకారం చుట్టారు. ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్న చోట అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో 132 ప్రాంతాల్లో 329 పోలింగ్ కేంద్రాలుండగా, ఈసారి 139 ప్రాంతాల్లో 408 కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు నిర్ణయించారు. నియోజకవర్గంలో మొత్తం 3,89,954 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 2,03,137, మహిళలు 1,86, 793, ఇతరులు 24 మంది ఉన్నారు. దీనికి సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను ఇప్పటికే జిహెచ్‌ఎంసి ప్రకటించింది. ఈనెల 17 వరకు ఓటరు నమోదు, తొలగింపు ఓటరు జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ఈనెల 30న తుది జాబితాను ప్రకటిస్తారు. మరోవైపు కొన్ని పోలింగ్ కేంద్రాలలో అధికారులు ప్రాథమికంగా మార్పులు చేర్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగా బోరబండ ఎన్ఆర్ ఆర్ పురంలోని రెండు పోలింగ్ కేంద్రాలను సాయిబాబానగర్ ప్రభుత్వ పాఠశాలకు మార్చారు. ఎల్లారెడ్డిగూడలోని రేడి యంట్ పాఠశాలలో ఉన్న అదనపు కేం ద్రాన్ని పడాల రామిరెడ్డి లా కళాశాలలోకి మార్చారు. వీటితోపాటు అ మానత్ పాఠశాలలో అదనపు కేంద్రాలను, ఆనంద్ విద్యాలయ కిడ్స్ పాఠశాల, యూసుఫ్‌గూడ వార్డు కార్యాలయంలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మరిన్ని ప్రాంతాల్లోనూ పరిశీలిస్తున్నారు.

**ఓటర్ల జాబితాలో రాజకీయ పార్టీల సహకారం కీలకం**

మరోవైపు ఓటర్ల జాబితా తయారీకి సంబంధించి ఏ విధమైన అపవాదులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సంక్షి ప్త సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి. కర్ణన్ సమావేశం నిర్వహిం చారు. తుది ఓటర్ల జాబితా సమగ్రంగా సిద్ధం చేసేందుకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి, పారదర్శకంగా జాబితా సవరణలో భాగస్వాములు కావాలని పార్టీ ప్రతి నిధులను కోరారు. జూలై 1 నాటికి 18 ఏళ్లు పూర్తిచేసుకున్న అర్హులైన పౌరులు ఈ నెల 17లోపు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు ఫారం6, 6ఏ, 7, 8 ద్వారా వచ్చిన 2,855 దరఖాస్తులు, అభ్యంతరాల్లో 8.62 శాతం దరఖాస్తులను పరిష్కరిం చామన్నారు. మిగతా దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని కర్ణన్ తెలిపారు. జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి అర్హులైన ఓటరును జాబితాలో చేర్చేందుకు, తప్పులేని ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు రాజకీయ పార్టీల సహకారం అత్యంత అవసరమని అన్నారు. తుది ఓటర్ల జాబితా ఈనెల 30న విడుదల చేస్తామన్నారు. సమావేశానికి ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కాంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ పల్లవి విజయవన్ శి, అదనపు కమిషనర్ (ఎలక్షన్స్) మంగళతాయారు హాజరయ్యారు.



జెండా ఊపి 108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్ రెడ్డి

# సిటీ సివిల్ కోర్టులో పూర్తిస్థాయి డిస్పెన్సరీ

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో త్వరలో ఏర్పాటు చేయనున్న పూర్తిస్థాయి డిస్పెన్సరీకి తన వంతు సహకారాన్ని అందిస్తానని సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్. శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సివిల్ కోర్టులో కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ హైదరాబాద్ (ఈఎమ్ఆర్ఐ) ఫౌండేషన్ సౌజన్యంతో, సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 108 అంబులెన్స్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు, కక్షి దారులు, కోర్టు సిబ్బంది 108 అంబులెన్స్ సేవలను సద్వినియం చేసుకోవాలని కోరారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలు అందు బాటులో ఉండడం వలన ప్రాణాపాయ స్థితి నుండి బయట పడవచ్చునని తెలిపారు. బార్ అసోసి యేషన్ కార్యవర్గంవారు ఎమ్మెల్యే, ఎంపీ నిధుల నుండి కచ్చిదారులకు కనీస సౌకర్యాలు, లైబ్రరీ, మంచినీటి వసతి తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. త్వరలో సిటీ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ కార్యవర్గ కమిటీ ఏర్పాటు చేయనున్న పూర్తిస్థాయి డిస్పెన్సరీకి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు బి అజయ్, ఆకుల శ్రీనివాస్, రాజిరెడ్డి, రాకేష్ కులకర్ణి, నిర్మల, అఫ్జల్ పాషా, ప్రసన్నలక్షి ్మ అడ్వకేట్ సొసైటీ అధ్యక్షులు సునీల్ గాను, డైరెక్టర్ అప్పారావు, మాజీ డైరెక్టర్లు, జనార్ధన్, సివి నారాయణ, కొండూరు వినోద్‌కుమార్, గోపాలకృష్ణ, తిరుమల్‌రావు పాల్గొన్నారు.

# ‘వేయిపడగలు’ వేరెవరూ తేలేరు

**సమకాలీన స్థితిగతులను ఆవిష్కరించిన ఆయనకే దక్కుతుంది**

**దేశ సాహిత్య చరిత్రలో ఓ శిఖర సమానం**

**విశ్వనాథ సత్యనారాయణ సంస్మరణ సభలో వక్తల ఉద్ఘాటన**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా సుసంపన్నం చేసిన ఘతన ‘కవిసమ్రాట్’ విశ్వనాథ సత్యనారాయణకే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు, -ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాలేశ్వరం శంకరం అన్నారు. సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హన్మంతరావు కళావేదికలో ఎందరోమహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నాలేశ్వరం శంకరం మాట్లాడుతూ విశ్వనాథ రచించిన వేయి పడగలు సుదీర్ఘ నవల నాటి సమాజిక ఆర్థిక సాంస్కృతిక పరిస్థితి కి ప్రతిబింబిస్తుందని తెలిపారు భారత పూర్వ ప్రధాని పివీ నరసింహా రావు సహస్ర ఫన్ పేరుతో హిందీ భాషాలోకి అనువదించి దేశానికి తెలుగు సాహిత్య ప్రతిష్ఠ పెంచారని గుర్తు చేశారు. కీలక ప్రసంగం చేసిన ఆచార్యులు డాక్టర్ జి ఎం శ్రీదేవి మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ కవి కథకుడు నవల రచయిత ఉత్తమ ఉపన్యాసకుడు సంప్రదాయవాది అని అన్నారు. అయనలో హాస్య చతురత కూడా ఎక్కువేనని ఉదహరించారు.




ప్రసంగిస్తున్న తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

తెలుగు సాహిత్యంలో ప్రతి ప్రక్రియలో తనదైనటువంటి ముద్ర ఏర్పర్చుకున్నారన్నారు. ఆయన రచనల పరిణామాన్ని సమకాలీన స్థితిగతులను ‘వేయిపడగల్లో’ చిత్రించిన విధానం నేడు ఎవరికి కూడా సాధ్యం కాదన్నారు. ఆయన రచనలను నేటితరం స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జీవితకాలంలో విశ్వనాథ సత్యనారాయణ లాంటి మహానుభావులు చూసే భాగ్యం దక్కాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గానసభ పాలక వర్గ సంయుక్త కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి, పాలకమండలి సభ్యులు శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాలాపూర్ గణేశ్ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

# బాలాపూర్ గణేశునికి కాసుల వర్షం

**హుండీ ఆదాయం రూ.23.13 లక్షలు**

**సరూర్‌నగర్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని కాకుండా దేశ, విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన బాలాపూర్ గణేషుని హుండీ ఆదాయం రూ.23.13 లక్షలు వచ్చింది. నవరాత్రుల సందర్భంగా దాదాపు 12 లక్షల మంది భక్తులు బాలాపూర్ గణనాథుడిని సందర్శించడం జరిగింది. అయితే గణేష్ నిమజ్జన కార్యక్రమం ముగిసిన నేపథ్యంలో సోమవారం హుండీల లెక్కింపు జరిపారు. బాలాపూర్ గ్రామంలో గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, పలువురు కమిటీ సభ్యుల పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కించారు. ఈ మేరకు లెక్కింపు పూర్తి కాగా మొత్తం ఆదాయం రూ.23,13,760 వచ్చింది. ఇందులో ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఆదాయం రూ.6,25,940 ఉండడం విశేషం. మొత్తం నగదు లెక్కింపులో రూ.500 నోట్లు 1642, రూ.200 నోట్లు 594, రూ.100 నోట్లు 4734, రూ.50 నోట్లు 3352, రూ.20 నోట్లు 2306, రూ.10 నోట్లు 300, రూ.20 నాణాలు 224, రూ.10 నాణాలు 2090, రూ.5 నాణాలు 3300, రూ.2 నాణాలు 5500, రూ.1 నాణాలు 5000 వచ్చినట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లె నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. ఈ హుండీ ఆదాయం మొత్తాన్ని బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి పేరిట ఉన్న బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏయే అభివృద్ధి పనులు, సామాజిక కార్యక్రమాలకు గణేష్ ఉత్సవ సమితి డబ్బులు వెచ్చించాల్సిన విషయం ఉత్సవ కమిటీ చర్చించి నిర్ణయం తీసుకుంటుందని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

# దర్యాప్తు సంస్థల ముసుగులో టార్చర్

**వృద్ధులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్ల పంజా**

**మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ వేధింపులు**

**డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామంటూ ఇంటికి వచ్చి భయబ్రాంతులు**

**విచారణ పేరుతో బ్యాంకు ఖాతా, ఎఫ్‌డీల వివరాలు సేకరణ**

**రూ.కోట్లు కొల్లగొడుతున్న కేటుగాళ్లు**

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారిపై సైబర్ పంజా విసురుతున్నారు. పలు బీమా సంస్థల నుంచి



వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి కవిత

వృద్ధుల ఫోన్ నెంబర్లు సేకరిస్తున్న సైబర్ నేరగాళ్ల వారికి పోలీసు, సిబీఐ, కస్టమ్స్ అధికారులమంటూ ఫోన్లు చేసి, మాయమాటలతో అందినంతా దోచుకుంటున్నారు. ముఖ్యంగా మీ పై మనీలాండరింగ్ కేసు నమోదైందని.. మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అనంతరం విచారణ పేరుతో బాధితుల బ్యాంకు ఖాతా, ఎఫ్‌డీల వివరాలు సేకరించి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరాల పట్ల సీనియర్ సిటిజన్లు అప్రమత్తంగా ఉండాలని నగర సైబర్ క్రైమ్స్ డీసీపీ ధార కవిత పేర్కొన్నారు.

**ఒక్క క్లిక్‌తో స్వాహా..**

వృద్ధాప్యంలో అవసరాల కోసం జీవితాంతం కష్టపడి కూడబెట్టుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు ఒక్క క్లిక్‌తో కాజేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. వృద్ధాప్యంలో తమ పిల్లలు పట్టించుకోకపోయినా, అనారోగ్య సమస్యల బారినా పడిన అత్యవసర సమయాల్లో అక్కరకు వస్తుందని దాచుకున్న డబ్బును స్వాహా చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధుల భయం, అత్యాశను సైబర్ నేరగాళ్లు అవకాశంగా మలుచుకుంటున్నారు. మోసపోతున్న వారిలో ఉన్నత విద్యావంతులు అధికంగా ఉంటున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొంటున్నారు.

మిగతా 3లో




# డబ్బుల్ స్పీడ్

**టౌన్ ప్లానింగ్‌కు ఐదు నెలల్లో రూ. 759.98 కోట్లు**

**గత సంవత్సరం కంటే 90శాతం అదనం**

**బిల్డ్‌నౌతో వేగంగా నిర్మాణ అనుమతులు**

**ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు జారీ**

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** జిచ్ఎంఇ ఆదాయ వనరుల్లో ఒకటైన భవన నిర్మాణ అనుమతులు, నిర్మాణాలు పూర్తయిన భవనాలకు జారీ చేసే అక్యుపెన్సీ సర్టిఫికెట్లతో ఈ ఏడాది జీహెచ్ఎంసీకి ఆదాయం పెరిగింది. కొత్త విధానాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులుఆకర్షించడం, జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు చెందిన క్యాంప్ ఆఫీసులు హైదరాబాద్ లో నెలకొల్పటంతో ఆఫీస్ స్పేస్‌ల ఆక్యుపెన్సీ డిమాండ్ బాగా పెరుగుతుంది. దీనికి తోడు నివాస గృహాల విక్రయాలు పెరగడం, ప్రస్తుతమున్న నిర్మాణాలు అదనంగా అంతస్తుల నిర్మాణం కోసం దరఖాస్తులను సమర్పించటం వంటివి ఆదాయ పెరిగేందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. అలాగే హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వం ప్రతిపాదించిన బహుళ

మిగతా 3లో



సమావేశానికి హాజరైన మాజీ ప్రజాప్రతినిధులు

## శ్మశానవాటిక అభివృద్ధి కోసం ఆమరణ దీక్ష

**నిజాంపేట్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :** ప్రగతినగర్ వ్యవస్థాపకులు, మాజీ ఉపసర్పంచ్ చల్లా సుధీర్ రెడ్డి అధ్వర్యంలో స్థానిక ప్రధాన సమస్యలపై సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎండి సాబెర్ అలీతో సమావేశం నిర్వహించారు. శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని అభ్యర్థించారు. సానుకూలంగా స్పందిచకపోతే అమరణ నిరాహర దీక్షకు కూర్చుంటామని హెచ్చరించారు. బతుకమ్మ ఘాట్‌లో బతుకమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్ఎంసి మాజీ కార్పోరేటర్లు చిట్ల దివాకర్, చల్లా ఇంద్రజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య

**ఉప్పల్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** కుటుంబ సమస్యలతో ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ వినయ్ కథనం ప్రకారం.. జనగామ జిల్లాకు చెందిన దోమ మహేందర్ (30) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అయితే అతనికి భార్య ఉంది. కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. భార్య స్వగ్రామానికి వెళ్లిపోవడంతో ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడని పోలీసులు తెలిపారు. కాగా సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఉండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వినయ్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉత్తమ అధ్యాపకురాలికి సత్కారం



సునీతను సత్కరిస్తున్న మహిళా అధ్యాపకులు

**సైఫాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** డా.బాబు జగ్జీవన్‌రామ్ (బిజెఆర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ ఇ.ఎం. సునీతకు సోమవారం నారాయణ గూడ లోని కళాశాల ప్రాంగణంలో ఘనంగా సత్కారం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా.విజయ్ కుమార్ అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ జి.గిరిధర్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో బాటనీ, మైక్రోబాయాలజీ విభాగాల అధ్యక్షులుగా మార్గదర్శనమిస్తూ కళాశాలకు గుర్తింపు తేచ్చే విధంగా ఆనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు.

## ఫ్యాన్‌కు ఉరేసుకొని యువతి ఆత్మహత్య

**మెహిదీపట్నం, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** భార్యాభర్తలు గొడవపడి భార్య చివరికి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ సైదులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... రాందేవ్ కూడా ప్రాంతానికి చెందిన రాజా రామ్ జిమ్ ట్రైనర్. అయితే నేక్ నామ్ పురా ప్రాంతానికి చెందిన అమూల్య (26)ను గత రెండు సంవత్సరాల క్రితం నుంచి ప్రేమించి, సంవత్సరం క్రితం వివాహం చేసుకున్నాడు. కాగా ఆదివారం రాత్రి అమూల్య, రాజారాం భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. ఈ క్రమంలో మూడున్నర ప్రాంతంలో రాజారం ఇంట్లోనే పడుకున్నాడు. అయితే అమూల్య ఇంట్లోనే ఫ్యానుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తెల్లవారుజామున రాజారం లేచి సూచేసరికి ఫ్యానుకు ఉరేసుకొని అమూల్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన చూసి వెంటనే కిందికి దింపి ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారని సిఐ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉమ్రా యాత్ర విజయవంతం

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** పవిత్ర ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని హైదరాబాద్ నగరానికి వచ్చిన కేంద్ర సంఘం టిఎన్‌జిఓ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీను తెలంగాణనాన్ గజిటెడ్ హైదరాబాద్ జిల్లా ఆద్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌కుమార్,కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులుకె.ఆర్ రాజ్‌కుమార్, కార్యవర్గసభ్యులు ముకీమ్‌ఖురేషీ, శ్రీధర్, గడ్డం జ్ఞానేశ్వర్, ముస్తాఫా, వహీద్, సోఫియాన్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు పుష్పగుచ్ఛం అందించిన కాంగ్రెస్ నేతలు

## పోలీసుల సేవలు మరువలేనివి

**జీడిమెట్ల, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా ముగియడంలో పోలీసుల సేవలు మరువలేనివని కొనియాడుతూ సోమవారం 130 డివిజన్ కాంగ్రెస్ పార్టీ తరపున వారందరికీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికిరణ్ పటేల్ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రులు పురస్కరించుకొని మన సూరారం పిఎస్ లిమిట్స్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి మండపం దగ్గర పటిష్ట భద్రత ఏర్పాటు చేసి ఈ యొక్క నవరాత్రులు ప్రశాంతంగా ఎటువంటి గొడవలు గాని ఇతరత్రా సమస్యలు గానీ లేకుండా ప్రజలు ప్రశాంతంగా ఆ భగవంతుని పూజలో పాల్గొని సంతోషంగా ఈ నవరాత్రులు జరుపుకోవడానికి మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి కృషి అభినందనీయమని అన్నారు. అలాగే సూరారం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధీర్ కృష్ణ తనదైన శైలిలో ఈ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవడానికి చాలా కష్టపడ్డారని కొనియాడారు. అలాగే పిఎస్‌లో గల సబ్ ఇన్స్పెక్టర్లు మురళి గౌడ్, రాజు, కృష్ణ, కృష్ణ నాయక్, లీమా, ఇతర సిబ్బంది అందరూ కూడా పగలు రాత్రి తేడా లేకుండా కష్టపడి ఈ నవరాత్రులు జరపడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో 130 డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికిరణ్ పటేల్, ఉపాధ్యక్షులు చందు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోగిఖర్ కరణ్, యూత్ నాయకులు జానీ, మనీ, తరుణ్, అభి, అమాల్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీరు వృథా చేసినందుకు కేసులు నమోదు

**బేగంబజార్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అక్రమ మంచినీటి కనెక్షన్లు తీసుకుని మంచి నీటి వాడుతున్న వినియోగారులపై జలమండలి విజిలెన్స్, గోడెకబర్ జలమండలి సెక్షన్ ఆద్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేశారు. విజిలెన్స్,అండ్ జలమండలి సంయుక్తంగా అధికారులు తమ సిబ్బందితో కలిసి మంగళ్‌హాట్ ప్రధాన రహదారిపై మంచినీటి వృధా వెళ్లనిస్తున్న వినియోగారులపై కేసు పెట్టారు. జలమండలి విజిలెన్స్ ఎస్ఐ సందీప్‌రెడ్డి,జలమండలి గోడేకబర్ సెక్షన్ మేనేజర్ గురునాథ్ తనిఖీలు చేశారు.కొందరు మంచినీటి వృదా చేయడం మూలంగా హైదరాబాద్ మెట్రోపాలిటిన్ సెక్షన్ 38,వాటర్ సప్లై వాటర్ బోర్డుయాక్టు కింద మంచినీటి రహదారులపై వృదగా వదులుతుండటంతో వారిపై 1000 రూపాయల జరిమానా విధించినట్లు చెప్పారు. అక్రమ మంచినీటి కనెక్షన్లు పొందిన వారిపైనా కేసులు నమోదు చేసి జైలుకు రిమాండ్ చేయడం జరుగుతుందన్నారు.

## బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం దశలవారీ ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

**సైఫాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** బయ్యారం ఉక్కు పరిశ్రమ పనులను వెంటనే ప్రారంభించాలని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, బయ్యారం ఉక్కు సాధన సమితి సమన్వయ కర్త ఎన్.దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల ముందు ఉక్కు పరిశ్రమను ప్రారంభం చేస్తామని హామీ ఇచ్చాయని గుర్తుచేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. అక్కడ రెండు లక్షల కోట్ల రూపాయల విలువగల ముడి ఇనుము ఉందని, పరిశ్రమ ప్రారంభిస్తే 50 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఏకమై బయ్యారం ఉక్కు పరిశ్రమను సాధించి, ప్రజల రుణాన్ని తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. పలువ విధాలైన నిరసనలు, ఆందోళనల ద్వారా ఉక్కు పరిశ్రమపై ప్రభుత్వం మెడలు వంచాలని కోరారు. సమావేశంలో ఈ సందర్భంగా మహాకవి జాషువా అవార్డు గ్రహీత సంగీతం రాజలింగంను సత్కరించారు.



సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో జరిగిన నేత్రదాన పక్షోత్సవాల్లో పాల్గొన్న ఆర్టీసీ ఎండి సజ్జనర్ తదితరులు

## ఐస్ బాక్స్ తరలింపునకు ఉచిత సేవలు

### నేత్రదాతలకు ఆర్టీసీ ఎండి సజ్జనార్ భరోసా

**మెహిదీపట్నం, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** అందత్వ నివారణ కోసం ప్రతి ఒక్కరు కండ్లను దానం చేసేందుకు ముందుకు రావాలని తెలంగాణ ఆర్టీసీ సంస్థ ఎండి సజ్జనార్ ప్రజలకు పిలుపునిచ్చారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకొని సోమవారం మెహిదీపట్నం సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామీణ ప్రాంతంలో ప్రజలు కండ్లు దానం చేస్తే ఆ కళ్ళను సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి తరలించేందుకు కళ్ళను ఐస్ బాక్స్‌ను ఆర్టీసీ బస్సులో ఏలాంటి చార్జీలు లేకుండా ఉచితంగా సరఫరా చేసేందుకు ఆర్టీసీ సంస్థ ద్వారా టైయఫ్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం చారిత్రాత్మకమైనదని పేర్కొన్నారు. అనంతరం ఆప్తమాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 13 లక్షల కార్నియా బ్లైండ్నెస్ ఉన్నారని, ప్రతి సంవత్సరం 30 నుంచి 40 వేలు కార్నియా బ్లైండ్నెస్ మారుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రెండు లక్షల బ్లైండ్నెస్ కావాలని ప్రతి ఒక్కరూ సహకరిస్తే అందరికీ చూపు వచ్చే విధంగా ప్రయత్నం చేయవచ్చు అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ రాజారావు, సిద్దిపేట మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ సంగీత షా, ఎన్ పి సి బి జాయింట్ డైరెక్టర్ కళావతి, సరోజినీ దేవి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని, ప్రొఫెసర్ డాక్టర్ సత్యవాణి, ఆర్ ఎం ఓ లు మహమ్మద్ ఇబ్రహీం, నీరజ, ప్రొఫెసర్లు శ్రీనివాస్, శ్రీధర్, విజయలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## తొలితరం తెలంగాణా ఉద్యమకారుడు విలియం కన్నుమూత



విలియం (ఫైల్)

**అల్వాల్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** తెలంగాణా తొలి దశ ఉద్యమకారుడు విలియం(89) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆ నాటి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన అయన పలు దఫాలు జైలు జీవితాన్ని అనుభవించారు. మలి దశ ప్రత్యేక రాష్ట్ర సాధనలోనూ అదే ఉత్సాహంతో పని చేశారు. కుటుంబాన్ని సైతం వదిలి రాష్ట్రం కోసం రోడ్డెక్కిన ధీరుడు. అఖరికి కటిక పేదరికంలో అల్వాల్ ఆదర్శ నగర్‌లో తుది శ్వాస విడిచారు. విలియం మృత దేహాన్ని ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో సందర్శించి నివాళులర్పించారు. తెలంగాణా వాటర్ రిసోర్స్ దవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి.ప్రకాష్ విలియం కుటుంబ సభ్యులను ఓదార్చారు. మలి దశ ఉద్యమలో విలియం నిర్వహించిన పాత్ర కీలకమని ప్రకాష్ కొనియాడారు. క్లాక్ టవర్ అమరుల స్థూపం పునాదులులో 69 ఉద్యమంలో అమరులైన విద్యార్థి ఉద్యమకారుల వస్తువులను సేకరించి ప్రతి అమర వీరుని ఇంటికి వెళ్ళి అప్పగించారని తెలిపారు. తెలంగాణా రాష్ట్రాన్ని కళ్ళారా చూసినా పేదరికంలో ఆయన మరణించడం బాదగా ఉందన్నారు. ఎన్నికలు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేని పక్షంలో విలియం పరిస్థితి లక్షలాది మంది ఉద్యమకారులు ఎదుర్కొనాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## గ్రహణం తర్వాత ఆలయాలల్లో సంప్రోక్షణ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** చంద్రగ్రహణం తర్వాత చిక్కడపల్లి, గాంధీనగర్, వివేక్ నగర్ లోని వివిధ ఆలయాలు సోమవారం తెరుచుకున్నాయి. ఆలయాలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం తర్వాత వేకువజామున వివిధ ఆలయ తలుపులు తెరిచారు. సుప్రభాత సేవను అర్చకులు ఏకాంతంగా నిర్వహించారు. వేకువజాము నుంచి మహా సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమం చేశారు. అనంతరం సుప్రభాతం, విశేష అభిషేకం, మహా నివేదన నీరాజనం, మహా మంత్రపుష్ప నిర్వహించారు.

## మరో పదేళ్లు అధికారంలో ఉండాలి



మహేష్‌కుమార్‌గౌడ్‌ను అభినందిస్తున్న ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** పిసిసి అధ్యక్షునిగా మహేష్‌కుమార్ గౌడ్ పదవి బాధ్యతలను చేపట్టి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని మరో పదేళ్ల పాటు అధికారంలో ఉంచేందుకు శ్రమిస్తున్నానని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక పార్టీ, ప్రభుత్వాన్ని జోడెద్దుల్లా ముందుకు నడుపుతున్నామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లోనూ పార్టీ, ప్రభు త్వం రెండింటినీ సమన్వయంతో ముందుకు తీసుకువెళ్తామని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటినుంచి అనేక ప్రజా సంక్షేమం పథకాలను అమలు చేశామని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రతిష్టా త్మకంగా అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులను చేయాలని సూచించారు.

## 18న పలువురు ప్రముఖులకు సాహిత్య పురస్కారాలు

**నాంపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీ ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు 2025 సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మక ధర్మనిధి సాహిత్య పురస్కారాలను ప్రకటించింది. ఈమేరకు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. డా. రాయారావు సూర్యప్రకాశరావుకు ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ, వేముగంటి మురళీకృష్ణకు ఆలూరి బైరాగి, డా. సంధ్యావిప్లవ్‌కు డా. పాకాల యశోదారెడ్డి, పింగిలి సుదర్శన్‌రెడ్డికి డా. వానమామలై వరదాచార్య పురస్కారాలు ప్రదానం చేస్తారు. డా. పొణుగోటి సరస్వతికి డా. చింతపల్లి వసుంధరారెడ్డి జానపద విజ్ఞాన పురస్కారం, డా. తూర్పు మల్లారెడ్డికి డా. బెజవాడ గోపాల్‌రెడ్డి పురస్కారం, డా. సాగి కమలాకరశర్మకు డా. దివాకర్ల వెంకటావధాని పురస్కారం, కందుకూరి అంజయ్యకు డా. రావికంటి వసునందన్ పురస్కారం, మ్యాకం రవికుమార్‌కు విశాల సాహితీ బిఎస్.రాములు పురస్కారం అందజేయనున్నట్లు చెన్నయ్య ఆ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 సాయంత్రం 5.30గంటలకు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన జరిగే ప్రత్యేక సభలో ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి 5వేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంతా సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

## గ్లోబల్‌హబ్‌గా ఎదగటానికి సిద్ధంగా ఉన్నాం

**రేపు ఐఎసిజి జపాన్ విశ్వవిద్యాలయంతో ఎంఓయూ**

**మల్టీమీడియా కళాశాల వ్యవస్థాపకుడు, ఎండి రామకృష్ణ**

**నాంపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** మల్టీమీడియాలో డిగ్రీ, పిజీ ప్రోగ్రామ్‌లను భారతదేశంలో తొలిసారి ప్రవేశపెట్టి ఐఎసిజి మల్టీమీడియా కళాశాల జపాన్‌లోని మంగ-అనిమ్ స్టడీస్‌లో ప్రపంచంలోనే మొదటి, అగ్రగామి విశ్వవిద్యాలయమైన కియోటోసేకా యూనివర్సిటీలో పరస్పర అవగాహన (ఎంఓయు) చేసుకోబోతున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, ఎండి రామకృష్ణ ప్రకటించారు. ఈమేరకు రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐలో జరిగిన పాత్రికేయ సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ ఒప్పందం తెలంగాణ రాష్ట్ర ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సమక్షంలో హైదరాబాద్ టీహబ్‌లో బుధవారం చేసుకోనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన ఒప్పందాన్ని రామకృష్ణ కియోటోసేకా షిన్ మత్సుమురా పరస్పరం మార్పిడి చేసుకుంటారని ఐఎసిజి సీఈఓ, ప్రిన్సిపాల్ డా. సురేష్ ముదిరాజ్, అకాడమిక్స్ హెడ్ సిహెచ్.చైతన్య పాత్రికేయులకు తెలిపారు. హైదరాబాద్‌లో వేగంగా ఎదుగుతున్న ఐటి ఎకోసిస్టమ్, క్రియేటివ్ ఇండస్ట్రీలను దృష్టిలో పెట్టుకుని ఈ ఒప్పందం ద్వారా గ్లోబల్‌హబ్‌గా ఎదగడానికి సిద్ధంగా ఉందని డా. సురేష్ ముదిరాజ్ అన్నారు. ఈ భాగస్వామ్యంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, హైదరాబాద్ కూడా చురుకుగా పాలుపంచుకోనున్నట్లు, దీని ద్వారా భారత క్రియేటివ్ విద్యార్థులకు విదేశీ ప్లేస్‌మెంట్ అవకాశాలు విస్తృతమౌతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణను ప్రపంచ క్రియేటివ్ లీడర్‌గా తీర్చిదిద్దడం, ఉద్యోగాలు, పెట్టుబడులు సృష్టించడం, ప్రపంచస్థాయి క్రియేటివ్ భాగస్వామ్యాలు ఏర్పరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శం

**పద్మశ్రీ కొలకలూరి ఇనాక్**



పురస్కారాలు ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ అందరికీ ఆదర్శ ప్రాయులని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరా బాద్ చిక్కడపల్లి లోని శ్రీత్యాగరాయ గానసభ నందు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సంద ర్భంగా ఆచార్య దేవోభవ అనే అంశంపై కవిసమ్మేళనం ఘనంగా జరిగింది. ముందుగా ముఖ్య అతిధులచే జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా సినీ దర్శకు లు రేలంగి నరసింహారావు రావు మాట్లా డుతూ భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ తత్వ శాస్త్రంలో ఎన్నో గ్రంధాలు, వ్యాసాలు రచించారు. యూనివర్సిటీ విద్యా కమిషన్ అధ్యక్షులుగా, రష్యా రాయబారిగా సేవలందించారని తెలిపారు. ముందుగా డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డికి గురు ప్రపూర్ణ అవార్డుతో సత్కరించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ పుస్కారగ్రహీతలు దేవసాని కొండారెడ్డి, డాక్టర్ ఆమంచ అంజయ్య, మీసాల వజ్రమ్మ, దారా ప్రభావతి, ఇప్ప ఉమారాణి, గుదే సుబ్బారావు, నందికొండ చంద్రయ్య, కందనూరు మహేశ్వరయ్య, పి.వి.ఎస్. నారాయణ రావు, ఎ.మధుసూదన్, కాసర్ల సరోజదేవి, నన్నపురాజు విజయశ్రీ, తిరుమల భారతి, డాక్టర్ బలిజేపల్లి నాగరత్నం, ఏడెల్లి వేరేంద్ర రెడ్డి, కేతాసుధాకర్ రెడ్డి, డాక్టర్ ఎమ్.ఎస్.కె.షా లను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ మునగా రామమోహన్ రావు, కోలేటి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## మరో గ్రంథాలయ ఉద్యమానికి మార్గం వేద్దాం

**-తెలంగాణ రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్**



ర్యాలీలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** అక్షరం ఒంటరిగా ఉన్న మనిషికి ప్రపంచాన్ని పరిచయం చేస్తుందని, మనిషి నూతన నాగరికత దిశగా నడిపిస్తారని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. సోమవారం "పుస్తకాలతో నడక వాక్ విత్ బుక్స్" కార్యక్రమంలో భాగంగా బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు నుంచి అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయం వరకు ర్యాలీ ప్రభాకర్, విజయలక్ష్మి ర్మ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ,మరింత విస్తరించడం కోసం పుస్తకాల ను మరింత చదవడం పెంచడం కోసం ప్రజల్లో అక్షరాస్యతను మరింత విస్తరించడం కోసం పుస్తకాలను చదివే అలవాటును పెంచడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తక ప్రియులు, రచయితలు,పుస్తక ప్రేమికులు ,గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ అక్షరాస్యతలను బాగా పెంచాలని పుస్తకాలు బాగా చదివే అలవాటును పెంచాలని కోరారు". తెలంగాణ రాష్ట్రం గ్రంథాలయ ఉద్యమం ఫలితంగానే ఏర్పడిందని, ఈ ప్రాంతంలో ప్రజాపాలన స్థాపన ,నియంతృత్వ పాలన అంతానికి ఈ ఉద్యమాన్ని దారి చూపాయని అన్నారు. రాష్ట్రంలో గ్రంథాలయ అభివృద్ధి కోసం విస్తరణ కోసం పుస్తకాలను ,చదువరులకు మరింత చేరువ చేయడం కోసం గ్రంథాలయ సంస్థ అనేక కార్యక్రమాలను చేపట్టబోతుందని వివరించారు. పుస్తకాలను చదవడం పుస్తకాలను చదివించడం సెల్ ఫోన్లో కన్నా పుస్తకాలతో ఎక్కువ గడపాలని వివరించారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులుకు చదువు పట్ల నిబద్ధత నేర్పించి రోజువారి కార్యక్రమంలో గ్రంథాలయాలను గంటసేపు కేటాయించాలని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గ్రంధాలయల అభివృద్ధి యువతను మిగతా చెడు అలవాట్లకు నుండి దూరం చేస్తుందని ,శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువత మరింత విస్తృతంగా ముందుకు సాగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు నర్సింగరావు, ప్రముఖ రచయిత వేణుగోపాల్ ,యాకూబ్, దర్శకుడు శ్రీధర్ పాల్గొన్నారు



వేడుకల్లో పాల్గొన్న రోగుల సహాయకులు

## నియమబద్ధమైన జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని గుడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ కేంద్రంలో సోమవారం వివిధ కార్యకమాలను నిర్వహించారు. 'హెల్తీ ఏజింగ్-ఫాల్ ప్రివెన్షన్' అంశంతో ఈ కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రంజిత్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలిలో భాగంగా చిన్న వయసులోనే వివిధ రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గుడ్‌లైఫ్ డైరక్టర్లు మనురెడ్డి, క్రాంతి తోపాటు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోగుల సహాయకులకు ఫిజియోథెరపీతో కూడిన పలు క్రీడలను నిర్వహించారు.



ఆచార్య పల్లవి కాబ్లేను సత్కరిస్తున్న ఆచార్య పుష్పచక్రపాణి, విజయ కృష్ణారెడ్డి, వడ్డాణం శ్రీనివాస్

## బెస్ట్ టీచర్ పురస్కారం బాధ్యతను పెంచింది

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రభుత్వ పరిపాలన శాస్త్రం అధ్యాపకురాలు, యూజీసీ-డెబ్ అఫైర్స్ డైరక్టర్ ఆచార్య పల్లవి కాబ్లేను విశ్వవిద్యాలయ అధికారులు సోమవారం ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలోఅకాడమిక్ డైరక్టర్ ఆచార్య పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్ విజయకృష్ణారెడ్డి, పలువురు ఆచార్యులైన శ్రీనివాస్, రబింద్రనాథ్ సోలమన్, వెంకటరమణ, వడ్డాణం శ్రీనివాస్, చంద్రకళ, పలువురు డీన్లు, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ వాణి కేంద్రం వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ జంపనప్రతాప్ తదితరులు

## 'కంటోన్మెంట్ వాణి'లో సమస్యలకు తక్షణ పరిష్కారం

**కంటోన్మెంట్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి ఈ నెల 10వ తేదీన బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో కంటోన్మెంట్ వాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సోమవారం బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసే కంటోన్మెంట్ వాణి కేంద్రాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటోన్మెంట్ వాణి కార్యక్రమానికి కలెక్టర్ హరిచందన దాసరి, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, హెల్త్, ఇంజనీరింగ్, సివిల్ సప్లయ్ విభాగాలతో పాటు కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, బోర్డులో ఉన్న అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్నవించుకుంటే వాటిని అక్కడే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నేతలు ముప్పిడి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



2వ వార్డు రసూల్ పురాలో తాగునీటిలో కలుషితం నీటిని పరిశీలిస్తున్న జలమండలి ఏఈ శ్రావన్, బిఆర్ఎస్ నేత యాసిన్

## తాగునీరు కలుషితంపై దిద్దుబాటు చర్యలు

**కంటోన్మెంట్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 2వ వార్డు రసూల్ పురా హన్‌మాన్ టెంపుల్ లైన్‌లో కలుషితం అవుతున్న తాగునీటిపై అధికారులు స్పందించారు. సోమవారం స్థానికంగా పర్యటించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. తాగునీరులో మురుగునీరు కలుస్తుండటాన్ని గుర్తించారు. ఈ విషయంపై ఇటీవల బిఆర్ఎస్ నేత యాసిన్ ఆధ్వర్యంలో బోర్డు కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు.



సత్కరిస్తున్న టీఎన్.శ్రీనివాస్ తదితరులు

## గన్‌బజార్ పాఠశాలలో ఉత్తమ టీచర్లకు సత్కారం

**కంటోన్మెంట్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** టీచర్స్‌డేను పురస్కరించుకొని సోమవారం 2వ వార్డు రసూల్ పురా గన్ బజార్‌లోని ప్రభుత్వపాఠశాలలో పనిచేస్తున్న ఉత్తమ టీచర్లు హెచ్‌ఎం.రంగనాథ్, గణేష్, శ్రీదేవి, ప్రమీళ, రజియా బేగం, సాయి ప్రకాశ్‌లను బోయిన్‌పల్లి మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దేవులపల్లి శ్రీను, కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ పరిసరాల్లో గంజాయి బ్యాచ్ హల్‌చల్

**కంటోన్మెంట్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని రెజిమెంటల్ బజార్ పరిసర ప్రాంతాల్లో కొందరు ఆకతాయలు నిత్యం హల్‌చల్ చేస్తూ స్థానికులకు భయభ్రాంతులు సృష్టిస్తున్నారు. గంజాయికి అలవాటు పడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం సాలుజా నర్సింగ్ హోం, సుప్రబాత్ హోటల్ పరిసర ప్రాంతాల్లో మద్యం మత్తులో కొంతమంది వీరంగం సృష్టించి టీ స్టాల్ నిర్వాహకుడిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

**బేగంపేట సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** పేదలు, నిరుపేదలు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశాల్ సుధాంలు కోరారు. సోమవారం బేగంపేట డివిజన్ పాటిగడ్డలో లబ్దిదారులకు మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేసారు. పాటిగడ్డకు చెందిన మంగమ్మకు కాలు విరిగిపోవడంతో ఆమెకు రూ 37,500, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహేష్‌కు రూ.60 వేల ఆర్థిక సహాయం చెక్కులను అందించారు.

## దర్యాప్తు సంస్థల ముసుగులో టార్చర్

(మొదటి పేజీ తరువాయి)

అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసినా భయపడకుండా వెంటనే డయల్ 100కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసులు ఫోన్లు చేసి నగదు బదిలీ చేయాలని అడగరని స్పష్టం చేశారు.

**తస్మాత్ జాగ్రత్త..**

1. ఈ మధ్య కాలంలో ఎక్కువగా వృద్ధులకు పోలీసు, సీబీఐ, కస్టమ్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ముసు గులో యూనిఫామ్స్ ధరించి వీడియో కాల్స్ చేసి, డిజి టల్ అరెస్ట్ చేశామంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారు. అలా ఎవరైనా ఫోన్ చేస్తే అస్సలు నమ్మకండి. అది మోసగాళ్లు చేసిన ఫోన్ అని గ్రహించి వెంటనే డయల్ 100, 1930 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయండి.
2. స్టాక్, క్రిప్టో, ఫోరెక్స్ వంటి వాటిలో పెట్టుబడి పెడితే అతి తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి మాయమాటలు చెబుతారు. అలా ఎవరికీ తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో లాభాలు ఇవ్వడం సాధ్యం కాదు. మీ ఆశను వారు అవకాశంగా మలుచు కుంటున్నారు. జాగ్రత్తగా ఉండాలి.
3. మీ ప్రొఫైల్ ఫోటోలను దొంగిలించి వాటిని దుర్వినియోగం చేయడం ద్వారా మీ పరిచయస్తులకు ఫోన్లు, మేసేజ్‌లు చేసి ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారు. కాబట్టి, ఎవరైనా అలా ఫోన్లు చేస్తే ముందుగా ఎవరు? ఏంటి? అని తెలుసుకొని సహాయం చేయండి. అంతే కానీ, మనకు తెలిసిన వారే కదా అని ఎవరికి పడితే వారికి నగదు బదిలీ చేస్తే అనంతరం మీరే బాధపడాల్సి వస్తుంది.
4. ఆకర్షణీయమైన పాలసీల పేరుతో.. నకిలీ ఇన్సూరెన్స్ ఏజెంట్ల ముసుగులో మీ వ్యక్తిగత సమాచారాన్ని రాబట్టి సైబర్ దాడులకు పాల్పడుతున్నారు. ఇన్సూరెన్స్ టాప్ అప్ అంటూ ఓటీపీలు పంపి, ఖాతాల్లో ఉన్న నగదు మాయం చేస్తున్నారు. ఒకవేళ మీరు బీమా ఇన్సూరెన్స్ చేయాలనుకుంటే మీ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సలహా మేరకు, కంపెనీ, ఏజెంట్ వివరాలను నిశితంగా పరిశీలించి బీమా ఇన్సూరెన్స్ చేయించుకోండి.
5. కొరియర్ కంపెనీ ఉద్యోగులుగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుగా నటిస్తూ మీ పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని బెదిరిస్తూ, విచారణకు సహకరించాలని, లేకపోతే అరెస్ట్ చేస్తామని బెదిరిస్తున్నారు. ఆర్బీఐ, సీబీఐ పేర్లతో నకిలీ అరెస్ట్ లేఖలు సృష్టించి, నగదు బదిలీ పేరుతో మీ ఖాతాలు ఖాళీ చేస్తారు.

**భయభ్రాంతులకు గురికావొద్దు : ధార కవిత (సైబర్ క్రైమ్ డీసీపీ)**

సీనియర్ సిటిజన్స్‌కు ఎవరైనా ఫోన్ చేసి ఇలాంటి మోసాలకు పాల్పడితే భయభ్రాంతులకు గురికావొద్దు. ఎవరైనా ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడినా.. ఒకవేళ సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయామని గ్రహించినా.. వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయండి. డయల్ 1930, వాట్సప్ నంబర్ 8712672222, వెబ్‌సైట్ సైబర్‌క్రైమ్.గౌ.ఇన్ లో ఫిర్యాదు చేయాలి. ఒకవేళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని గ్రహించిన గోల్డెర్ అవర్(గంటలోపు) ఫిర్యాదు చేస్తే డబ్బును సైబర్ నేరగాళ్ల చేతిలో పడకుండా ఫ్రీజ్ చేయవచ్చని నగర సైబర్ క్రైమ్స్ డీసీపీ ధార కవిత తెలిపారు.

## టౌన్‌ప్లానింగ్‌కు డబుల్ స్పీడ్

(మొదటి పేజీ తరువాయి)

అంతస్తుల పై ఓవర్లు, గ్రేడ్ సెపరేటర్లు, అండర్ పాస్‌లు, జంక్షన్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ వంటి మౌలిక సదుపాయాల పనులు కూడా రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం, ఈ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తూ సంస్థ ఆదాయానికి గణనీయంగా తోడ్పడుతోంది. బిల్డింగ్ పర్మి షన్లు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌ల దరఖాస్తులను బిల్డ్‌నౌ అనే ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నారు. ఇందులో ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్, ఇన్‌స్టంట్ అప్రూవల్, సింగిల్ విండో వంటి మాడ్యూల్స్ ద్వారా పర్మిషన్లు వేగంగా మంజూరవుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం 4389 బిల్డింగ్ పర్మిషన్లను జారీ చేయటంతో పాటు 1008 ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌లు జారీ చేసి, ఈ రెండు మార్గాల ద్వారా రూ. 759.98 కోట్లు ఆదాయం సాధించినట్లు ప్లానింగ్ విభాగం అధికారులు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయానికి సమకూరిన రూ. 399.61 కోట్లు ఆదాయంతో పోల్చితే, ఈ సారి అదనంగా 90 శాతం ఆదాయం పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

బిల్డ్‌నౌతో వేగంగా అనుమతులు..

నిర్మాణ అనుమతులు వేగంగా పూర్తిచేసేందుకు తీసుకువచ్చిన బిల్డ్‌నౌ అప్లికేషన్ తోఅనుమతులు వేగంగా మంజూరవుతున్నాయి. ఈప్రక్రియను వేగవంతం చేయటంతో పాటు నిర్మించనున్న భవనం 3డీ వ్యూ వంటివి అందుబాటులోకి రావటం కూడా ఆదాయం పెరిగేందుకు ముఖ్య కారణం. గతంలో ఇదే రకంగా అమలు చేసిన టీజీబీపాస్ అప్లికేషన్ స్థానంలో వచ్చిన ఈ కొత్త వ్యవస్థ పూర్తిగా ఆన్‌లైన్‌లో, అన్ని సేవలను ఒకే ప్లాట్‌ఫామ్‌పై అందిస్తోంది. దీని వల్ల సేవలు వేగవంతంగా అందటంతో పాటు పారదర్శకత కూడా పెరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ నేరుగా పర్యవేక్షి స్తున్న పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ లోని దరఖాస్తులను సీఎం నేరుగా ఎప్పటికప్పుడు దరఖాస్తుల పరిశీలించటంతో పాటు పరిష్కారంలో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు సమీక్షలు నిర్వహిస్తూ ఉండటంతో సేవలు మరింత వేగవంతమయ్యాయి. హెచ్‌ఎండీఏ లో భవన నిర్మాణ అనుమతులు, అక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీలో ఆలస్యమవుతున్నాయన్న విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి ఇటీవలే హెచ్‌ఎండీఏ అధికారుల తీరుపై సీరియస్ అయిన విషయం తెల్సిందే. ఈ పరిణామంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ కూడా టౌన్ ప్లానింగ్ విభాగాన్ని గాడీన పెట్టేందుకు పలు సంచలనాత్మక నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు.



విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేస్తున్న ఎంఈఓ శంకర్ రాథోడ్, దాతలు

## పభుత్వ పాఠశాలకు దాతలు చేయూత

**అత్తాపూర్ సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రేమావతి పేట్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు మునీరా బేగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ హాజరై మాట్లాడారు. పిల్లలకు తాగు నీటిని ప్లాస్టిక్ బాటిళ్లు, గ్లాస్‌లతో తాగకుండా విద్యార్థుల అందరికి కమతం లక్ష్మి స్టీల్ వాటర్ బాటిల్స్ , టీచర్ సరిత, అంగన్వాడి టీచర్ వినోద, మాజీ విద్యా కమిటీ ఛైర్మెన్ పోనమోని మల్లేష్ యాదవ్‌ల సహకారంతో విశ్వనాథ్ పాఠశాలకి చైర్స్, టి.భవాని దాస్ పాఠశాలకి మైక్ సెట్ డొనేట్ చేయడం జరిగిందని వారు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో రాత్రి వేళ్లలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండటంతో వాటిని అరికట్టడానికి పాఠశాల ప్రాంగణంలో సి. సి.కెమెరాలు ఏర్పాటుకు ఎడ్లకాడి నర్సింహా జ్ఞాపకార్థం ఎడ్లకాడి సూర్యం కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ జై రామ్ సంఘం అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్, పుస్తకాల మురళి మోహన్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

## విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరగాలి

**పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి**
**జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఉపాధ్యాయులకు సూచించారు. ఈమేరకు సోమవారం నాంపల్లి లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందాలని సూచించారు. పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు అందించాలని, డిజిటల్ విద్యాబోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదేవిదంగా 10వ తరగతి విద్యార్థులకు గ్రేడింగ్ ద్వారా విద్యాబోధన అందించి నూరు శాతం ఉత్తీర్ణత ఉండేలా చూడాలని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వివిధ క్రీడల్లో రాణించేలా ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. తదుపరి తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన తీరును పరిశీలించి ఎఫ్.ఆర్.ఎస్ తీరుపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్ట్రెంత్, అందిస్తున్న మెనూ విధానం అలాగే గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తదితర అంశాలపై ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈకార్యక్రమంలో డీఈవో రోహిణి, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, హెచ్.ఎం హాబీ బా , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి

## ఆర్టీసిలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

**-రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** ఆర్టీసిలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. సోమవారం ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి నాయకత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్టీసీ ఆపరిష్కృత కార్మిక సమస్యలపై ముఖ్యంగా కార్మికులను అత్యంత ఆందోళనకు గురిచేస్తున్న వర్క్ షాప్ ల ఎత్తివేతకు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని విరమింపజేయ్యాలని, తక్షణం అట్టి వర్క్ షాపుల తరలింపును ఆపివేయాలని మంత్రికి వివరించారు. సంస్థకి కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలని, అదేవిధంగా ఆర్టీసీలో జరుగుతున్న పరిణామాలు, పని ఒత్తిడి, పెండింగ్ లో ఉన్న విలీన ప్రక్రియ ఇంకా యూనియన్ల పునరుద్ధరణపై చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. నాయకుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి వర్క్ షాపుల తరలింపు తన దృష్టికి రాలేదని, సిఎంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ముఖ్యసలహాదారు బొయపల్లి యద్దయ్య, జిహెచ్‌జెడ్ జోనల్ కార్యదర్శి ఆర్.ఎన్.రెడ్డి, హైదరాబాద్ రీజియన్ ప్రెసిడెంట్ వి.శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, సికింద్రాబాద్ రీజియన్ కార్యదర్శి గోపు శ్రీనివాస్, అక్తర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి బిటెక్ విద్యార్థిని మృతి

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అనుమానస్పద స్థితిలో రైలు కింద పడి ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి చెందిన ఘటన ఘట్కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఘట్కేసర్‌లోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న హిత వర్షిణి ఇటీవల మూడు రోజుల పాటు సెలవులపై ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘట్కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి సుమారు 9.15 గంటల ప్రాంతంలో రైలు కిందపడి చనిపోయి ఉండవచ్చని రైల్వే పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం ట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్న రైల్వే సిబ్బంది సమాచారం మేరకు హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇంజనీరింగ్ విద్యార్థిని మృతిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## అలాయ్‌బలాయ్‌ను విజయవంతం చేద్దాం : బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అలాయ్‌బలాయ్ 20వ విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హర్యానా పూర్వ గవర్నర్ బండారుదత్తాత్రేయ అన్నారు. సోమవారం రామ్‌నగర్‌లో బండారు దత్తాత్రేయ తన నివాసంలో అక్టోబరు 3న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన అలాయ్‌బలాయ్‌సన్నాహక సమావేశం అలాయ్‌బలాయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి, పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో పాటు కేంద్రప్రభుత్వంలో కీలక శాఖల్లో పలువురు సీనియర్ మంత్రులు, దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లోకసభ, రాజ్యసభ సభ్యులు, పలువురు ప్రముఖులతో పాటు చలనచిత్రరంగానికి చెందిన పలువురు ప్రముఖుల, సీనియర్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు అ కార్యక్రమంలో పాల్గొనబోతున్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గౌతమ్‌రావు, వేముల అశోక్, బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా పూర్వ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, రమేశ్‌రామ్, డెక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్, బి.అశోక్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, కప్పర ప్రసాద్, కార్పొరేటర్ దీపిక, ఇ.అజయ్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతీ వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా ఈ కార్యక్రమం ఉండాలని, కళాకారులు, అన్నివర్గాల ప్రజాప్రతినిధులు, పౌరులను ఒకే చోటకే ఈ కార్యక్రమం చేర్చుతుందన్నారు. బందరు దత్తాత్రయ రూపొందించిన అలై బాలై, సంవత్సరాలుగా రాజకీయ, సామాజిక సరిహద్దులను దాటించి ముఖ్యమైన సాంస్కృతిక సమాహారంగా అభివృద్ధి చెందింది. ఇది సంప్రదాయ సంగీతం, నృత్యం, వంటకాలు కళలు ప్రదర్శించడానికి ఒక వేదికగా పనిచేయడంతో పాటు, వైవిధ్యమైన సముదాయాల మధ్య సంభాషణ, స్నేహితత్వాన్ని కూడా ప్రోత్సాహిస్తుంది.



ప్రసంగిస్తున్న హర్యానా పూర్వ గవర్నర్ దత్తాత్రేయ



గండిపేటలో కాంగ్రెస్ నాయకుల దృశ్యం

## సిఎం సభకు భారీగా తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు

**నార్సింగి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** గండిపేట మండలం గండిపేల జలాశయం వద్ద జరిగిన బహిరంగ సభకు రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరళి వెళ్లారు. గత మూడు రోజులుగా ఈ సభ నిర్వాహణను అధికారులతో కలిసి ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పర్యవేక్షించారు. సోమవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభ విజయవంతం కావడంతో ఎమ్మెల్యే ఆయన అనుచరగణం సంతోషంను వ్యక్తం చేశారు. వారిలో రాష్ట్ర నాయకుడు ముంగి జైపాల్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, బండ్లగూడ జాగీర్ మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ టి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు గండయ్య ముదిరాజ్, క్యాతం అశోక్ యాదవ్, రామేశ్వరం నర్సిహ్మా, కె.రామకృష్ణారెడ్డి, పి.కృష్ణారెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న పిడమర్తి రవి తదితరులు

## అక్టోబర్ 30న మార్వాడి గో బ్యాక్ గర్జన

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అక్టోబర్ 30న మార్వాడి గో బ్యాక్ గర్జన నిర్వహిస్తామని మార్వాడి గో బ్యాక్ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కల్తీ వ్యాపారం కొనసాగిస్తూ ప్రభుత్వానికి పన్ను ఎగవేస్తున్న ఎగవేతదారులను రాష్ట్రం నుంచి పంపించాలనే ముఖ్య ఉద్దేశంతో అక్టోబర్ 30న మార్వాడి గో బ్యాక్ గర్జనను నిర్వహిస్తామని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని కల్తీ మాఫియా నుంచి కాపాడుకోవాలన్నదే తమ లక్ష్యమన్నారు. అందుకు తెలంగాణ కవులు కళాకారులు అందరూ సహకరించాలని ఉన్నారు. మార్వాడి గో బ్యాక్ జేఏసీ ఆవిర్భావం తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా 10 ప్రజా సంఘాలు 5 విద్యార్థి సంఘాల కలయికతో మార్వాడి గో బ్యాక్ జేఏసీ ఆవిర్భవించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైశ్య వికాస వేదిగిరిజన శక్తి, జాగో తెలంగాణ, మాదిగ జేఏసీ,ఎమ్మార్పీఎస్, గద్వాల వర్తక వ్యాపారస్తులు వేదితెలంగాణ ఉద్యమకారుల సంఘం బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయిని బ్రహ్మ సంఘం పద్మశాలి సంఘంలు భాగస్వామ్యం అయినట్లు తెలిపారు. ఈ సమావేశానికి కాచం సత్యనారాయణ, మాస్టర్ జి,కోటగిరి ఉషారాణి, జిలకర శ్రీనివాస్, తెలంగాణ శ్యామ్,పొన్నం ముత్యం గౌడ్, రాజేష్ నాయక్, దయాకర్,గి. రాములు నేత, గుడిపల్లి రవి, ఎండి రహీం,బోరెల్లి సురేష్, శ్రీనాథ్, జెస్సీ, పబ్బతి శ్రీకృష్ణ, జనగామ నర్సింగ్, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, డాక్టర్ మీసాల మల్లేష్, కురుపాటి సుదర్శన్, గద్దల నాగేశ్వరరావు, నరసింహ, దర్శనం జాన్, బోర్ర సురేష్,దేవరకొండ నరేష్ తదితరులు హాజరయ్యారు.

## గణపతి లడ్డును దక్కించుకున్న తెలంగాణ ఉద్యమనేత అబ్దుల్ ఫయీం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలం పాటలో ముస్లీం మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తి మతసామరస్యతను కాపాడుతూ ఏకంగా లక్ష ఒక వెయ్యి రూపాయలకు సోమవారం దక్కించుకున్నాడు. స్థానిక వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ గణపతి లడ్డును లక్ష ఒక వెయ్యి రూపాయలకు వేలం పాటలో రాంనగర్ కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అబ్దుల్ ఫయుం దక్కించుకున్నారు.



హైదరాబాద్ కమలా నగర్‌లో తెలంగాణ నాయర్ సేవా సొసైటీ ఓనం వేడుకల్లో మహిళలు



నరేంద్ర మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బిజెపి శ్రేణులు

## మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోంది

**కెపిహెచ్బి కాలనీ, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** దేశంలో మోదీ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల సంక్షేమమే ధ్యేయంగా తీసుకుని ముందుకెళ్తోందనీ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. మోదీ ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేస్తూ, పేద, రైతు, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకున్న శుభసందర్భంంగా కూకట్పల్లిలో భారత ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం ఆయన ఫ్లెక్సీకి వడ్డేపల్లి రాజేశ్వరరావు నాయకులు కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వల్ల నిరుపేద, మధ్యతరగతి కుటుంబానికి నేరుగా లాభం చేకూరబోతోందన్నారు. అధికార ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పెరిగిన ధరలు, పెరిగిన పన్నుల భారం వల్ల ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు మోదీ జీఎస్టీ సంస్కరణలు ఊరట కలిగిస్తున్నాయనీ అన్నారు. పేదల అభ్యున్నతి పట్ల మోదీ ప్రభుత్వ నిబద్ధతకు నిలువుటద్దం లాంటిదని కొనియాడారు. పండుగల సమయంలో పేద కుటుంబాలు సంతోషంగా నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయగలిగేలా నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని వడ్డేపల్లి పేర్కొన్నారు. ఇటువంటి నిర్ణయం వల్ల ప్రతి కుటుంబానికి రోజువారీ అవసరాలపై భారీ ఉపశమనం లభిందని హర్షం వ్యక్తం చేసారు. మోది సుపరిపాలనకు దేశంలోని ప్రతి ఒక్కరు కూడా సంతోషం వ్యక్తపరుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మాంజాల రమేష్

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** ఎన్నిక ఆఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా మాంజాల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్, జాతీయ జనరల్ సెక్రటరీ గుంజ శ్రీనివాస్‌లు ప్రకటించారు. ఈ మేరకు వారు మాంజాల రమేష్‌కు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్, కాచిగూడ లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన రాష్ట్ర సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేముల లక్ష్మణ్ మాట్లాడుతూ ఓబీసీ లో అత్యంత వెనుకబడిన వడ్డెర సామాజికవర్గం ఎదుర్కుంటున్న అనేక సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం కొరకు కృషి చేయాలన్నారు. గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ మన ముందున్న ప్రధాన డిమాండ్లు వడ్డెర సామాజికవర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చడం, రాష్ట్రంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకునిగా తనవంతు సహాయసహకారాలు అందిస్తానని చెప్పారు. నూతనంగా ఆఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన మాంజాల రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలు పర్యటించి వడ్డెరుల సమస్యలను తెలుసుకొని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వడ్డెర సామాజిక వర్గం అభ్యున్నతికి మరియు సమాజ అభివృద్ధికోసం తన వంతు కృషి చేస్తానని సంకల్పం వ్యక్తం చేసారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీ తోపాటు జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మణ్, గుంజ శ్రీనివాస్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు వేముల తిరుమల దేవి, రాష్ట్ర నాయకులూ రేపాని కాశీనాథ్, డాన్ శ్రీను, సంపంగి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మాంజాల రమేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న వేముల లక్ష్మణ్, గుంజ శ్రీనివాస్

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**అంబర్‌పేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** మెరుగైన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ పరవస్తు మధుకర్ స్వామి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పిటిసి ఆవరణలో పలు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను సోమవారం ఆయన సత్కరించారు. అలాగే విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు అందించి బాగా చదవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా మధుకర్ స్వామి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల నిబద్ధత విలువలు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని ఆయన కోరారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పిటిసి అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరించిన ప్రిన్సిపల్ పరవస్తు మధుకర్ స్వామి


తెలంగాణ ప్రభుత్వం
**కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ**

నిట్ నం. టెండర్ ప్రకటన నం. 01/EE-II/QQSUDA/2025-26 తేది: 03.09.2025
పని యొక్క పేరు: షేర్-ఎ-బాతిల్ కమాన్ యొక్క పునరుద్ధరణ మరియు నవీకరణ కొరకు DPR తయారీకి కన్సల్టెన్సీ సర్వీసులు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ మరియు సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 09.09.2025 సా.04.00. డౌన్‌లోడ్ ముగింపు తేది : 16.09.2025 మ.3.30గం. బిడ్ల స్వీకరణకు చివరి తేది మరియు సమయం : తేది: 16.09.2025 సా.04.00. ప్రైస్ బిడ్ తెరచు తేది: 16.09.2025 సా.04.30. అధికారి పేరు, చిరునామా సెల్ నం: శ్రీ బి. గోపాల్, EE-II, QQSUDA, దారుల్‌షిఫా, హైదరాబాద్. 9121240341.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, QQSUDA.
DIPR.NO. 7733-PP/CL/ADVT/1/2025-26 తేది: 08.09.2025



**IN THE COURT OF THE HONBLE XIX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD**

**O.S NO. 3463 OF 2025**
**Between**
**T. Moahn Rao and others ...Plaintiffs**
**And**
**MRO. Hyderabad and others ....Defendants**
**To**
**All Concerned**

Take notice that the above suit has been filed by Sri. Tanniru Mohan Rao, Smt. Fanmiru Lakshmi Mohan and Smt. Renupriya Mohan for declare them as legal heirs of deceased Tanniru Srinivas Mohan. The suit is posted on 23-09-2025 for hearing etc. If any one desire to oppose the above application can file their objections, if any, or may appear before this Hon'ble Court on 23-09-2025 at 10.30 am otherwise the matter will be decided as per law.

**BY ORDER OF THE HONBLE COURT)**
**N.RAMA RAO**
**Advocate,**
Ummaheswarn Nilayam, Flat No-104
Gayatri Towers, H.No.2-2-1109/1/3,
Sharada Nagar, Bagh Amberpet,
Hyderabad-500 013



**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client **BINGI PRAVEEN,** S/o. B. Mallesh, Aged about 34 years, Occ: Business, R/o. H.No. 2-81, Chengicherla Village, Boduppal Municipality, Medipally (M), Medchal Dist was in the custody of the original Link sale deed document relating to the property i.e., Open Plot No.25 in Sy.No.42 Admn.175 sq.yards situated at Chilakeswar Nagar Colony, Uppal Kalasa Village, Uppal Mandal, Medchal-Malkajgiri Dist but the said Original registered Link sale deed bearing document No.10559/2022 Dated: 14-07-2022 have been lost/misplaced by my client at UPPAL SRO office while transit from UPPAL to CHIL; AKANAGAR at around 15.00 to 16.00 PM on dt: 24-08-2025 by two wheeler vehicle bearing no.TS 08 JC 2523 along with his friend namely G MADHUSUDAN REDDY and to that effect my client also made a complaint before police officials at PS Uppal, Rachakonda Commissionerate. If any person or person(s) who came across the custody of the said Original Link Document i.e. original registered sale deed bearing document No. 10559/2022 Dated: 14-07-2022 be pleased to hand-over to the undersigned or to my client

**Sd/- (CH. SUNITHA)**
**Advocate**
H.No.8-53/6, DWARAKANAGAR
UPPAL, MEDCHAL-
MALKAJGIRI DIST
**Ph.No.8143366893**

